సాక్షి
అనంతపురం
బుధవారం । 31 । జూలై । 2024



చీనీ టన్ను రూ.16,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16,500 పలికాయి.



టమాట కిలో రూ.30

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.23 ప్రకారం అమ్మకాలు జరిగాయి.



జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఐదు రోజుల్లో చిరుజల్లులు



బుక్కరాయసముద్రం: రానున్న 5 రోజుల్లో జిల్లాలో చిరుజల్లులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 33.8–34.6, రాత్రి ఉష్ణోగ్రతలు 24.2–24.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 67–71 శాతం, మధ్యాహ్నం 44–52 శాతంగా నమోదవుతాయని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం టవర్‌క్లాక్: ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదన్నారు. ప్రజాదర్బారులో వచ్చిన సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆగస్టు 1 నుంచి 31 వరకూ నర్సాపూర్‌-ధర్మవరం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలు ఏర్పాటు చేస్తున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నర్సాపూర్‌-ధర్మవరం (17247/48) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఫస్ట్ క్లాస్ 01, టూటైర్ 01 అదనపు బోగీలను జత చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీఓఎస్ఎస్) ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. పదో తరగతిలో చేరేందుకు 14 ఏళ్లు నిండిన వారు, ఇంటర్ ప్రవేశానికి 15 ఏళ్లు నిండిన వారు అర్హులని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి తెలిపారు. ఈనెల 31 (నేటి) నుంచి ఆగస్టు 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ. 200 అపరాధ రుసుంతో సెప్టెంబరు 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. www. apopenschool.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ కోరారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ లేదా ఏఐ సెంటర్లలో సంప్రదించాలని తెలిపారు.

అనంతపురం రూరల్ మండలానికి చెందిన పరమేశ్వర్ ప్రైవేట్ ఉద్యోగి. ఈయన కుమార్తె నగరంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఇటీవల ఆ అమ్మాయికి స్కూల్ ఫీజు, యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు, టై, బెల్ట్, షూ, బస్సు రవాణా తదితరాలు కలిపి రూ. లక్షా 30 వేల బిల్లు చూసి పరమేశ్వర్ అవాక్కయ్యాడు. గతేడాదికంటే దాదాపు 40 శాతం పెరిగింది. తనకొచ్చే జీతం ఇంటి ఖర్చులకు సరిపోతోంది. చేసేదిలేక అప్పులు చేసి మరీ కుమార్తె ఫీజు చెల్లించాడు.

- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచిన విద్యాసంస్థలు
- డబ్బులు కట్టలేక అల్లాడిపోతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు
- లక్షల రూపాయల ఫీజులు కడుతున్నా కనీస వసతులు కరువు
- మామూళ్ల మత్తులో నోరు మెదపని విద్యాశాఖ యంత్రాంగం



ఫీజుల మాటున దోపిడీ

అనంతపురం ఎడ్యుకేషన్: కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు అమాంతం పెంచేశారు. స్కూళ్లలో పని చేసే సిబ్బందితో మాట్లాడితే తమ చేతుల్లో ఏమీ లేదంటున్నారు. యాజమాన్యం తీసుకున్న నిర్ణయం అని కరాఖండీగా చెప్పేస్తున్నారు. జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఐఐటీ, కాన్సెప్ట్, టెక్నో, ఈ–టెక్నో, స్మార్ట్, టాలెంట్, ఒలంపియాడ్, సీబీఎస్ లాంటి ఆకర్షణీయమైన పేర్లతో బోర్డులు పెట్టుకుని దోపిడీ చేస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించాలంటే సగటు మనిషి ఒళ్లు గుల్ల చేసుకోవాల్సిన పరిస్థితి. బయట మార్కెట్‌లో రూ. 2 వేలకు లభించే యూనిఫాం, పుస్తకాలకు కార్పొరేట్ విద్యా సంస్థల్లో రూ. 12 వేలు వసూలు చేస్తున్నారు.

మామూళ్ల మత్తులో..

విద్యార్థులు,తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. మామూళ్లమత్తులో నోరు మెదపడం లేదు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు, రెన్యూవల్స్ ఫైళ్ల విషయంలో విద్యాశాఖ ఉద్యోగులు లంచాల రేట్లను ఫిక్స్ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు అనుమతులు, రెన్యూవల్స్ కోసం ఎంఈఓ కార్యాలయాల్లో రూ.30 వేల నుంచి రూ. 40 వేలు, డీఈఓ కార్యాలయంలో రూ. 60 వేలు, ఉన్నత పాఠశాలల అనుమతులు, రెన్యూవల్స్ కోసం డిప్యూటీ డీఈఓ కార్యాలయాల్లో రూ. 50 వేలు, డీఈఓ కార్యాలయంలో రూ.80 వేలు, ఆర్జేడీ కార్యాలయంలో రూ. 80 వేలు ఖర్చు పెట్టుకోవాల్సిందే. అందుకే ఈ స్కూళ్ల ఫీజుల విషయంలో అధికారులు నోరు మెదపడం లేదనే ఆరోపణలున్నాయి.

సాంత్వన చేకూర్చిన గత ప్రభుత్వం..



గత ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థుల తల్లులకు 'అమ్మ ఒడి' పథకంతో కొండంత అండగా నిలిచింది. తల్లుల బ్యాంకు ఖాతాల్లో వరుసగా నాలుగేళ్ల పాటు రూ. 15 వేల చొప్పున జమ చేశారు. ఈ డబ్బు చాలా ఊరటగా ఉండేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. అమ్మ ఒడి పథకం కింద జిల్లాలో నాలుగేళ్లలో రూ.1,718.35 కోట్లు (ఇందులో రెండేళ్లు ఉమ్మడి జిల్లా) జమ చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం వస్తే 'తల్లికి వందనం' పేరుతో ఎంతమంది పిల్లలున్నా అందరికీ రూ. 15 వేల చొప్పున ఏటా ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న తల్లిదండ్రులు చాలా సంతోషపడ్డారు. ఏడాదికి రూ. 30 వేలు, రూ. 40 వేలు వస్తాయని ఆశ పడ్డారు. కానీ, విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలవుతున్నా ఇవ్వకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్‌కు కొమ్ము కాస్తున్న విద్యాశాఖ అధికారులు



ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీకి విద్యాశాఖ అధికారులు కొమ్ము కాస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. గతంలో కంటే నేడు రెట్టింపుగా విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల కోసం విద్యా సంస్థలు పట్టి పీడిస్తున్నాయి.

– అఖిల్‌కుమార్‌రెడ్డి, ఏబీవీపీ ఉమ్మడి జిల్లా కన్వీనర్

ఆధారాలతో ఫిర్యాదు చేసినా చర్యల్లేవు



విద్యాశాఖ అధికారులు కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలతో మామూళ్లు తీసుకుంటూ వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలల గురించి ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా కనీసం స్పందించడం లేదు. వారికి మామూళ్లు అందుతున్నాయి కాబట్టే పట్టించుకోవడం లేదు.

– కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

కలెక్టర్ స్పందించాలి



కార్పొరేట్ పాఠశాలలు గత ఏడాదికంటే ఈసారి 40 నుంచి 50 శాతం ఫీజులు పెంచాయి. స్కూళ్లలో కనీస వసతులు ఉండడం లేదు. ఫీజుల మాటున మాత్రం దోపిడీ చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఫీజుల నియంత్రణ తమ పరిధిలో లేదంటూ చేతులెత్తేస్తున్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఎనుమల నరేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి



కార్పొరేట్ ఫీజులుంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి. అడ్డూఅదుపు లేకుండా ఫీజుల దోపిడీ చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేకున్నా మామూళ్లు తీసుకుంటూ అనుమతులు, రెన్యూవల్స్ చేసేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కసాపురంలో 5 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 3 వరకూ శ్రావణ మాస ఉత్సవాలు జరగనున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఆలయ సమీపంలోని రామదూత నిలయంలో ఆలయ ఈఓ భద్రాజీ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ నెల రోజుల పాటు జరగనున్న శ్రావణ మాస ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటకల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో రానున్నారన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వసతి, విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. కసాపురంతో పాటు నేమకల్లు, మురడి దేవాలయాలను భక్తులు దర్శించుకుంటారని, ఆయా ప్రాంతాలకు కూడా ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు. వాహనాల పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి ఎస్. అశ్వర్థ, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, కసాపురం ఎస్ఐ దుగ్గిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల ఉత్సవంలో అపశ్రుతి

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లిలో పోతులయ్య స్వామికి మంగళవారం నిర్వహించిన బోనాల ఉత్సవంలో ఆలయ సేవకుడు మృతి చెందాడు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని పోతులయ్య స్వామికి గ్రామస్తులు బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. బోనాలను ఎత్తుకుని ఊరేగింపు వెళుతున్న సమయంలో చౌడేశ్వరి ఆలయ సేవకుడు రామాంజనేయులు (50) నృత్యం చేస్తూ రాయి తట్టుకుని కింద పడ్డాడు. అదే సమయంలో గుండెపోటుకు గురయ్యాడు. గ్రామస్తులు వెంటనే ఆయనను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిత



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

- కలెక్టర్ వినోద్‌కుమార్

ఉరవకొండ: చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిత అందుతుందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉరవకొండ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తరగతి గదులు, వంటగది, అధ్యాపకుల క్వార్టర్స్ పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థినులకు ఇబ్బందుల్లేకుండా మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. మోను ప్రకారం భోజనం అందించాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని విద్యాశాఖ, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, రెసిడెన్షియల్ పాఠశాలల సిబ్బందితో ఓ బృందం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నెలా మొదటి మంగళవారం బృందంతో సమీక్ష నిర్వహించి విద్యార్థుల ప్రగతి, క్రీడా కార్యక్రమాల అమలు గురించి తెలుసుకుంటానన్నారు. విద్యార్థులు కోరుకున్న పాఠశాలల్లోనే సీట్లు కేటాయించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఆర్‌డీఓ శ్రీనివాసరెడ్డి, డీసీఓ మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్‌బాషా, ఎంపీడీఓ సుబ్బరాజు, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

మొదటి రోజే వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేస్తాం

ఆగస్టు 1నే వంద శాతం పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొ న్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై మంగళవారం విజయవాడ నుంచి సీఎస్ నీరబ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా అత్యంత పకడ్బందీగా పెన్షన్ల పంపిణీ చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను ఆయన పరిశీలించారు. స్టోరేజీ ట్యాంకుల సామర్థ్యం, హెచ్చెల్సీ కాకుండా హంద్రీనీవా నీటితో నింపే అవకాశాలు ఉన్నాయా అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్ఎస్ ట్యాంకులన్నింటినీ హెచ్చెల్సీ నీటితోనే నింపాల్సి ఉంటుందన్నారు.ఉరవకొండ, కొనకొండ్ల గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకుల్లో కూడా అదనపు బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి నీటిని నింపాలన్నారు. జిల్లాలో అక్కడక్కడా పడిన వర్షాలతో భూగర్భజలం రీచార్జ్ అయ్యిందన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి వస్తున్న నీటిని పీఏబీఆర్‌కు మళ్లించి చాగల్లు వరకూ తీసుకెళ్లామన్నారు. నింబగల్లు నుంచి 6 కిలోమీటర్ల దూరంలో హంద్రీనీవా కాలువ ఉందని, అక్కడి నుంచి కూడా నీటిని పంపింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి రోజూ తనకు నీటి పంపింగ్ నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్‌డీఓ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్‌బాషా, డీఈ అంజుమన్‌సుల్రీన్, జేఈ షామీదా, ఎంపీడీఓ సుబ్బరాజు, డిప్యూటీ తహసీల్దార్ హరినాథ్, సర్పంచ్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుని హుండీ ఆదాయం రూ.90.73 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ, బ్యాంక్ అధికారులు లెక్కించారు. 66 రోజులు గాను రూ.90,73,407 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే 23.855 గ్రాముల బంగారం, 310 గ్రాముల వెండి, 43 అమెరికా డాలర్లు, ఒక సౌదీ రియాల్, ఒక కువైట్ దినార్ హుండీల ద్వారా భక్తులు శ్రీవారికి సమర్పించినట్లు ఆయన వెల్లడించారు. గతం కంటే ఈ సారి ఆదాయం పెరిగిందన్నారు.

అనుమానాస్పద మృతి కేసులను ఛేదించాలి





సమీక్షలో పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు, మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనంతపురం: అనుమానాస్పద మృతి కేసులను ప్రాధాన్యతగా తీసుకుని ఛేదించాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. ఎస్ఐ, ఆపై స్థాయి పోలీసు అధికారులతో మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నేర సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో పాటించాల్సిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. రౌడీషీటర్లు, కిరాయి హంతకులకు కౌన్సెలింగ్ ఇచ్చి సత్ప్రవర్తనతో నడుచుకునేలా చూడాలన్నారు. హత్య కేసుల దర్యాప్తులో చూపించిన ప్రతిభను, అనుమానాస్పద మృతి కేసుల్లోనూ చూపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తే నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతిభద్రతల పరిరక్షణకు అవకాశం కలుగుతుందన్నారు. పోక్సో కేసుల దర్యాప్తులో ఆలస్యం చేయరాదన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఫ్యాక్షన్ ప్రభావం లేకున్నా అలసత్వం పనికిరాదని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లు విస్తృతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఆర్. విజయ భాస్కర్ రెడ్డి, డీటీసీ వీర్రాజు, డీఎస్పీలు టీవీవీ ప్రతాప్, బి. శ్రీనివాసులు, జనార్దన్ నాయుడు, బీవీ శివారెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం

బొమ్మనహాళ్: హొస్పేటలోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. సోమవారం 1,31,179 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి 68,630 క్యూసెక్కులకు పడిపోయింది.ప్రస్తుతం జలాశయంలో 101.890 టీఎంసీల నీరు ఉన్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గిందని వెల్లడించారు. డ్యాం 33 క్రస్ట్ గేట్లలో 12 గేట్లు ఎత్తి 40,160 క్యూసెక్కుల నీటిని నదికి, 9,553 క్యూసెక్కులు కాలువలకు విడుదల చేస్తున్నామన్నారు. జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 101.890 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,632.03 అడుగులకు నీరు చేరింది.



తుంగభద్ర జలాశయం

క్లుప్తంగా

ఈడిగ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


విశ్వనాథ్


మనోహర్

అనంతపురం ఎడ్యుకేషన్: ఈడిగ (గౌడ్) ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం ఆ సంఘం ప్రస్తుత అధ్యక్షుడు ఈజీ నాగభూషణం అధ్యక్షతన స్థానిక రేణుకాయల్లమ్మ ఆలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈ.విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మనోహర్, ట్రెజరర్‌గా ఎన్.విజయ్‌కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఉద్యోగ సంఘం నాయకులు నారాయణస్వామి గౌడ్, సుధాకర్‌గౌడ్, రాఘవేంద్రగౌడ్, బాబుగౌడ్, ఆదినారాయణగౌడ్, మహేశ్వరయ్య గౌడ్, మోహన్‌గౌడ్, శ్వేత పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి


గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్

అనంతపురం: ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డులకు రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన హోంగార్డులు మంగళవారం పరేడ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహేష్‌కుమార్... హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ విధులు నిర్వర్తించాలన్నారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్‌లు రెన్యూవల్ అవుతున్నది, లేనిది చూసుకుంటూ ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలన్నారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మధు, తదితరులు పాల్గొన్నారు.

భూసారం తేలేదెలా?

- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు 35,800 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం
- టార్గెట్లు ఇచ్చి ఒత్తిడి చేయడంతో ఇష్టారాజ్యంగా మట్టి సేకరణ
- నిబంధనలకు తిలోదకాలిచ్చిన ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ చేపట్టిన మట్టి పరీక్షల ఫలితాలు వెల్లడైనా... ఇందులో కొన్ని ఫలితాల భూసారం ఏ గ్రామానికి చెందినది... ఏ రైతు పొలంలోనిది అనేది మాత్రం తేలకుండా పోతోంది. ఒక్కొక్కరు నాలుగు రోజుల్లో 40 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షా కేంద్రానికి పంపాలని టార్గెట్లు విధించడంతో రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) ఇన్‌చార్జ్‌లు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నిబంధనలకు తిలోదకాలిచ్చి చాలా మంది తమ పరిధిలో నాలుగైదు పొలాల నుంచి 20 నుంచి 30 వరకు శ్యాంపిల్స్ సేకరించి, అనంతపురంలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపారు.

కనిపించని ఊరూ.. పేరు

ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు సేకరించి పంపిన మట్టి నమూనా ప్యాకెట్లపై సంబంధిత రైతు పేరు, ఏ గ్రామం, ఇతర సమాచారం పేర్కొనకపోవడం గమనార్హం. ఇలాంటి నమూనాలకు సంబంధించి నిర్వహించిన పరీక్షల ఫలితాల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించకపోవడం, అవగాహన ఉన్నా... సేకరణకు సమయం ఇవ్వకపోవడం లాంటి కారణాలతో ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. విధించిన టార్గెట్ల మేరకు రైతుల పొలాల్లోని మట్టిని సేకరించి ప్రయోగశాలకు పంపారు. కానీ, వాటిపై పూర్తి స్థాయి వివరాలు పేర్కొనకపోవడంతో పరీక్షలు నిష్ప్రయోజనమయ్యాయి.



భూసార పరీక్ష కేంద్రం ఎదుట పడేసిన మట్టి నమూనాలు

35,800 నమూనాల సేకరణ

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు సంబంధించి మొత్తం 35,800 మట్టి నమూనాలు సేకరించి ప్రయోగశాలలో పరీక్షించాలని దిశా నిర్దేశనం చేశారు. ఇందులో అనంతపురానికి 18,600, శ్రీసత్యసాయి జిల్లాకు 17,200 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. సేకరించిన మట్టి నమూనాల్లో పోషకాలకు సంబంధించి 12 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో పీహెచ్ (భూమి స్థితి) శాతం, ఎలెక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్పరస్ (పీ), పొటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూలపోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), సూక్ష్మపోషకాల (మైక్రో న్యూట్రియంట్స్) శాతం విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించేలా రైతులకు కార్డులు అందజేస్తారు. అయితే టార్గెట్లు ఇచ్చే నాటికే ఖరీఫ్ పంటల సాగు కొనసాగుతోంది. పంటల సాగు సమయం, వర్షాలు పడే కాలంలో మట్టి నమూనాలు సేకరించినా సరైన ఫలితాలు రావని అధికారులు చెబుతున్నారు. మట్టి నమూనా సేకరించాలంటే దానికి ఒక పద్ధతి ఉన్నా... అది ఎక్కడా పాటించలేదని తెలుస్తోంది.

మట్టి సేకరణలో జాగ్రత్తలివే...

- పంట కోత తర్వాత వేసవిలో, లేదా పంటలు లేని సమయంలో మట్టి నమూనాలు సేకరించాలి.
- చెట్ల కింద, గట్ల కింద, పంట కాలువలు, కాలిబాటల్లో నమూనాలు సేకరించకూడదు.
- పశువుల ఎరువు, కంపోస్టు కుప్పలు ఉన్న చోట తీయకూడదు.
- సారవంతమైన ప్రాంతాల్లో కూడా మట్టి తీయకూడదు.
- చౌడు భూములు, ఇతర సమస్యాత్మక భూముల్లో విడివిడిగా నమూనాలు తీయాలి.
- రసాయన ఎరువులు వేసిన నెల రోజుల వరకూ మట్టి సేకరణ చేయకూడదు.
- నీరున్న చోట, బురదగా ఉన్న చోట కూడా తీయకూడదు.
- పైరు పొలంలో ఉన్నప్పుడు తీయాల్సి వస్తే వరుసల మధ్యలో నమూనాలు సేకరించాలి.
- నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం, నేల వాలు, చౌడు, క్షార, ఆమ్ల గుణాలు, పంటల సరళి తదితర విషయాలలో ఏవైనా తేడాలు కనిపిస్తే అన్ని రకాల నమూనాలు ఆ పొలం నుంచే తీయాలి.
- పొలంలో ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసేసి, 'వి' ఆకారంలో పార లేదా అగర్‌తో గోతులు తీయాలి. గొయ్యి అంచుల నుంచి పారతో గాని, తాపీతో గాని మట్టిని సేకరించాలి. పొలంలో 8 నుంచి 10 ప్రాంతాల్లో పై పద్ధతిలో మట్టిని సేకరించాలి. అనంతరం ఆ మట్టినంతటిని కలిపి నేల మీద పరచి దానిని నాలుగు భాగాలుగా చేయాలి. మూలలకు ఎదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకుని మిగిలిన మట్టిని పారవేయాలి. ఇలా సేకరించిన అర కిలో మట్టి నమూనాను గుడ్డ సంచి లేదా పాలిథీన్ సంచిలో నింపి అందులో రైతు పేరు, చిరునామా, సర్వే నెంబరు, పొలం విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటలు, సేకరించిన తేదీ తదితర వివరాలు జత చేసి భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి.

మల్బరీ సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించండి


వీఎస్‌ఏలతో సమావేశమైన డీఎస్‌ఓ అంజనేయులు

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యం మేరకు 900 ఎకరాల్లో మల్బరీ (రేషం) సాగు విస్తీర్ణం పెంచేలా దృష్టి సారించాలని విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ల (వీఎస్‌ఏ)ను జిల్లా పట్టుశాఖ అధికారి (డీఎస్‌ఓ) డి.అంజనేయులు ఆదేశించారు. మల్బరీ సాగు విస్తీర్ణం పెంపుపై మంగళవారం స్థానిక పట్టుశాఖ కార్యాలయంలో సెరికల్చర్ అధికారి ఓబులేసుతో కలసి వీఎస్‌ఏలతో సమీక్షించారు. తాజా పరిస్థితుల్లో నీటి వనరులు కలిగిన రైతులు రేషం పంట వేసుకోవడం వల్ల మంచి లాభాలు గడించవచ్చన్నారు. ఈ అంశంపై రైతులను చైతన్య పరచాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు అదనంగా మరింత చేయూత ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కూడా వర్తింప జేసి ప్రయోజనాలు కల్పిస్తామన్నారు. ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగుకు ముందుకు వచ్చే రైతులకు పుల్ల నాటుకునేందుకే రూ.22,500, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.27 వేలు అందిస్తామన్నారు. అలాగే చిన్న, పెద్ద సైజు షెడ్ల నిర్మాణం, సూట్ రేరింగ్ స్టాండ్, నేత్రికలు, ఇతర పోషకాలకు కూడా రాయితీలు వర్తిస్తాయన్నారు. వీటిపై రైతుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముంటుందన్నారు. సాగు విస్తీర్ణం గణాంకాలు తేల్చడానికి త్వరలో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ మొదలవుతుందన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు దుర్మార్గం

- తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, వీఓఏలు

అనంతపురం అర్బన్: చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్లు, కార్మికులపై టీడీపీ నాయకులు సాగిస్తున్న రాజకీయ వేధింపులు దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మండిపడ్డారు. రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలంటూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆ శాఖ జిల్లా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట నాయకులు, ఐకేపీ వీఓఏలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో స్కీమ్ వర్కర్లపై టీడీపీ నాయకులు దాడులు చేసి బెదిరిస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో కార్మికులను ఇష్టారాజ్యంగా తొలగిస్తున్నారన్నారు. ప్రభుత్వ జీఓలు, అధికారులు ఇచ్చిన స్టాండింగ్ ఆర్డర్లను లెక్క చేయకుండా వంట పాత్రలను బయటపడేసి మహిళలపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటి వరకూ 670 మందిని తొలగించారన్నారు. వీరంతా 2003 నుంచి పనిచేస్తున్న కార్మికులన్నారు. ఆశా వర్కర్లపై సైతం బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. రాప్తాడు, రాయదుర్గం, విడపనకల్లు, గుత్తి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, కూడేరు, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప, శెట్టూరు మండలాల్లో రాజీనామా చేయాలంటూ ఆశా వర్కర్లను బెదిరిస్తున్నారన్నారు. అలాగే ఐకేపీ పరిధిలోని వీఓఏలపైనా (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్) బెదిరింపులు, తొలగింపులు జరుగుతున్నాయన్నారు. వీఓఏ పని తీరుపై గ్రామ సంఘాల్లో చర్చ జరపకుండానే తమ వారిని ఏర్పాటు చేసుకుంటాం.. తప్పుకోండి అంటూ దౌర్జన్యాలు సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలను టీడీపీ నాయకులు మానుకోవాలన్నారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను నాయకులు కలిసి వినతిపత్రం అందజేసి పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, నాగరాజు, ఐకేపీ లీడర్లు నాగభూషణం, పాతన్న, సరస్వతి, నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మాన్యం భూములకు రక్షణ కల్పించాలి

- ఎండోమెంట్ ఉప కమిషనర్ పట్టెం


ఉప కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఈఓలు

అనంతపురం కల్చరల్: ఎండోమెంటు భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం కూడదని, వెంటనే మాన్యం భూములకు రక్షణ కల్పించాలని సంబంధిత అధికారులను దేవదాయశాఖ రాయలసీమ జోన్ ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్ ఆదేశించారు. అనంతపురంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో మంగళవారం జరిగిన ఉమ్మడి జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్లు, ఈఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో సకాలంలో లీజు చెల్లించని కాంట్రాక్టర్ల నుంచి ఎండోమెంటు స్థలాలను, భూములకు ఏపీ దేవాదాయశాఖ సవరణ చట్టం ప్రకారం తక్షణమే రక్షణ కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న దేవాలయ భూములకు వెంటనే వేలం నిర్వహించాలన్నారు. పట్టణ, నగర ప్రాంతాల్లో ఉన్న భూములను గుర్తించి దీర్ఘకాలిక లీజుకు సంబంధించి వేలం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. వివాదంలో ఉన్న భూములను తక్షణమే కోర్టు ఉత్తర్వుల ప్రకారం రిలీవ్ చేయాలని, కౌలు గుత్తలు చెల్లించని వారికి లీజు రద్దు నోటీసులు జారీ చేయాలని సూచించారు. కబ్జాకు గురైన దేవుని మాన్యాలను తిరిగి స్వాధీనం చేసుకుని రక్షణ కల్పించాలని ఆదేశించారు. అలాగే పబ్లికేషన్ అయి ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ లేని దేవాలయాలకు వెంటనే రిజిస్ట్రేషన్ చేసి, సెక్షన్ 22 ఏ(1) సీ లిస్టుకు, సవరణ ప్రతిపాదనలు పంపాలన్నారు. చట్టపరమైన బకాయిలను వెంటనే చెల్లించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అనంతపురం జిల్లా ఎండోమెంట్ అధికారి ఆదిశేషనాయుడు, శ్రీసత్యసాయి జిల్లా ఏసీ నరసింహరాజు, ఉభయ జిల్లాలోని అన్ని ఆలయాల ఈఓలు, ఎండోమెంట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, మండల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీలో అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో సర్జరీ విభాగం వైద్యులు మరో అరుదైన ఆపరేషన్‌తో ట్రాన్స్‌జెండర్ ప్రాణాలు కాపాడారు. వివరాలను మంగళవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ నెల 25న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అందే సేవలపై ట్రాన్స్‌జెండర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు హాజరైన ఉరవకొండకు చెందిన ట్రాన్స్‌జెండర్ స్వాతి మాట్లాడుతూ... తనకు నెల రోజుల క్రితం చోటు చేసుకున్న ప్రమాదంలో తలకు గాయమైందని, దీంతో తల తిరగడం, తలనొప్పితో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే ఆపరేషన్‌కు రూ.6 లక్షల ఖర్చు అవుతుందని అక్కడి వైద్యులు తెలిపినట్లు పేర్కొంది. స్పందించిన డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్‌ఎంఓ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత ప్రత్యేక చొరవ తీసుకుని ఆమెను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. పరీక్షించిన వైద్యులు ఆమె తలకు గాయమైనప్పుడు మెదడులో రక్తస్రావమై గడ్డ కట్టినట్లుగా గుర్తించి, శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ నేతృత్వంలో డాక్టర్ సుబ్రమణ్యం (అనస్తీషియా, డిప్యూటీ సూపరింటెండెంట్), న్యూరో సర్జన్లు డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్ బాబు, ఎస్‌ఆర్‌లు డాక్టర్ అచ్యుత్, సీఎంఓ డాక్టర్ రీనా తదితరులు ఈ నెల 27న దాదాపు మూడు గంటల పాటు శ్రమించి స్వాతికి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. ఈ సందర్భంగా న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ బృందాన్ని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లు అభినందించారు.


ట్రాన్స్‌జెండర్ స్వాతితో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

మెనూ సక్రమంగా అమలు చేయండి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్


మాట్లాడుతున్న వడిత్యా శంకర్‌నాయక్

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం అనంతపురంలోని నవోదయ కాలనీలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని వార్డెన్‌కు సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేయడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ట్యూటర్లను ఏర్పాటు చేసి, ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధించేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

గుంతకల్లు టౌన్: స్థానిక అరవిందనగర్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగిని ఝాన్సీ నివాసంలో చోరీ జరిగింది. బాధితురాలు తెలిపిన మేరకు.. డీపీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె సోమవారం సాయంత్రం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చారు. అనంతరం ఇంటికి తాళం వేసి సమీపంలోని తన బంధువుల ఇంటికి వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు క్వార్టర్స్ వెనుక వైపు ప్రహరీపై దూకి ఇంటి తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలో భద్రపరిచిన 3 తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు, ఒక ల్యాప్‌టాప్‌ను అపహరించుకెళ్లారు. అదే రోజు రాత్రి ఇంటికి వచ్చిన ఆమె చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం ఉదయం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


మృతుడు ధనుష్

గార్లదిన్నె: స్థానిక శింగనమల క్రాస్ సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... శింగనమల మండలం గురుగుంట్ల గ్రామానికి చెందిన ఆరుగురు కూలీలు వ్యవసాయ పనుల కోసం ఆటోలో గార్లదిన్నెకు బయలుదేరారు. గార్లదిన్నె శివారులోని శింగనమల క్రాస్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేక్ వేయడంతో ఆయన పక్కనే కూర్చొన్న ఇంటర్మీడియల్ విద్యార్థి వరికూటి ధనుష్(17) కిందపడ్డాడు. అదే సమయంలో విద్యార్థిపై ఆటో బోల్తాపడింది. ధనుష్‌తో పాటు ఇద్దరు కూలీలు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ధనుష్‌ను స్థానికులు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్సకు స్పందించక బాలుడు మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

ఆకట్టుకున్న 'వారసత్వ నడక'


హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షిలో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వారసత్వ నడక (హెరిటేజ్ వాక్) నిర్వహించారు. పర్యాటక, పురావస్తు శాఖలు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ఓరియంటల్ పాఠశాల వద్ద ప్రారంభమైన వారసత్వ నడక నంది విగ్రహం, వీరభద్రస్వామి దేవాలయం వరకూ కొనసాగింది. కేంద్ర పర్యాటక శాఖ (హైదరాబాద్) సహాయ సంచాలకులు ఆర్.కృపాకర్, చరిత్ర పరిశోధకుడు మైనాస్వామి మాట్లాడుతూ.. వీరభద్రస్వామి ఆలయం, నంది విగ్రహం విశేషాలు, విజయనగర సామ్రాజ్య శిల్ప శైలీ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్ర పర్యాటక సమాచారాధికారి ప్రవీణ్, పురావస్తు శాఖ అధికారి బాలకృష్ణారెడ్డి, ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరి, బాలాజీ కళాశాల అధ్యాపకుడు గురుమేఘ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత


బాధిత కుటుంబసభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనంతపురం: జిల్లా ఏఆర్ విభాగానికి చెందిన ఎస్‌ఐ హాజీపీరా, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు నాయక్ ఇటీవల మృతి చెందారు. దీంతో హాజీపీరా భార్య వహీదా, శ్రీరాములు నాయక్ భార్య పూజకు కార్పస్ ఫండ్ కింద చెరో రూ.ఒక లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో మంగళవారం ఉదయం ఎస్పీ కేవీ మురళీకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఇందిర, సూపరింటెండెంట్ బి.ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులనాయుడు, ఆనంద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల జీవనోపాధుల తొలగింపు


చికిత్స పొందుతున్న రాజ్‌బహదూర్

కదిరి టౌన్: ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న నిరుపేదల జీవనోపాధులను అధికారులు తొలగించారు. దీంతో మనస్తాపం చెందిన ఓ వ్యాపారి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు... రెండు రోజులుగా కదిరి మున్సిపాలిటీ పరిధిలోని రహదారుల పక్కన వ్యాపారం చేసుకుంటున్న వారి దుకాణాలను అధికారులు తొలగిస్తూ వస్తున్నారు. మంగళవారం ఉదయం టవర్‌క్లాక్ ఎదురుగా తన టీ స్టాల్‌ను తొలగించే సమయంలో చిరువ్యాపారి రాజ్ బహద్దూర్ అధికారులను అడ్డుకున్నాడు. ఈ వ్యాపారంపైనే మొత్తం తన కుటుంబం ఆధారపడి జీవిస్తోందని, తమకు జీవనాధారమైన టీస్టాల్‌ను తొలగించరాదని అధికారులను వేడుకున్నాడు. అయినా అధికారులు వినకుండా టీస్టాల్‌ను తొలగించారు. దీంతో మనస్తాపం చెందిన రాజ్‌బహద్దూర్ పురుగుల మందు తాగాడు. విషయాన్ని గుర్తించిన అధికారులు వెంటనే ఆయనను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిరువ్యాపారుల జీవనోపాధులకు అన్ని రకాలుగా సహకరిస్తూ వచ్చిందని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తమ బతుకులు ఛిన్నాభిన్నమవుతున్నాయంటూ ఈ సందర్భంగా పలువురు చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉన్నఫళంగా బంక్‌లను తొలగిస్తుండడంతో బతుకు తెరువు కోల్పోతున్నామని వాపోయారు.

వృద్ధురాలిని ఏమార్చి నగల అపహరణ

సోమందేపల్లి: వృద్ధురాలిని ఏమార్చి, ఆమె నగలను అపహరించుకెళ్లిన ఘటన సోమందేపల్లిలో కలకలం రేపింది. వివరాలు... స్థానిక సాయినగర్‌లో నివాసముంటున్న వృద్ధురాలు హమ్మినిబాయి ఇంటి వద్దకు మంగళవారం ఉదయం ఓ దుండగుడు చేరుకున్నాడు. ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకుంటే నిత్యావసర సరుకులు అందుతాయని తెలిపాడు. దుండగుడి మాటలు నమ్మిన ఆమె తన ఆధార్ కార్డ్‌ను తీసుకొచ్చి చూపింది. దానిని అప్‌డేట్ చేస్తానని, శరీరంపై నగలు తీసి పక్కన పెట్టాలని తెలిపాడు. దీంతో ఆమె తన శరీరంపై ఉన్న బంగారు నగలు తీసి పక్కన పెట్టింది. అదే సమయంలో ఆమె దృష్టి ఏమార్చి నగలు తీసుకుని దుండగుడు ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. తాను మోసపోయానని గుర్తించిన వృద్ధురాలు చుట్టుపక్కల వారి సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య

ఆత్మకూరు: మండలంలో 1వ తేదీన వంద శాతం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఎంపీడీఓ దశరథరామయ్య గ్రామ సచివాలయ ఉద్యోగస్తులకు సూచించారు. మంగళవారం బి.యాలేరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో పింఛన్‌దారులు ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లినా లేదా వారి వేలిముద్రలు పడకపోయినా అలాంటి వారికి మాత్రమే రెండో తారీఖు ఇవ్వాలన్నారు. అందుబాటులో లేని పింఛన్‌దారులకు కూడా రెండో తేదీ పింఛన్ తీసుకోవచ్చని తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడికి పీహెచ్‌డీ



ఎంకే మదన్‌మోహన్

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకుడు ఎంకే మదన్‌మోహన్‌కు ఎస్కేయూ పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు, తులనాత్మక సాహిత్య శాఖ ఆధ్వర్యంలో ఆచార్య జి. బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో 'చెంగీజ్ ఖాన్ నవలాత్రయం తులనాత్మక అధ్యయనం' అనే అంశంపై మదన్‌మోహన్ పరిశోధన చేశారు. చారిత్రక నవలలను అధ్యయనం చేయడం ద్వారా అప్పటి సంస్కృతి, వారసత్వ సంపదలను పరిరక్షించుకునే వీలు కలుగుతుందని మదన్‌మోహన్ తెలిపారు. భారత మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ సైతం 'చెంగీజ్ ఖాన్ ఈజ్ ది హీరో' అని అతని గొప్పతనాన్ని చెప్పిన వైనాన్ని ఇందులో ప్రధానంగా ప్రస్తావించారు. మదన్‌మోహన్ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా తెలుగు శాఖ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జెన్నే యోగీశ్వర నాయుడు, శ్రీశ్రీ కావేటిక విశ్వవిద్యాలయం జీనియర్ డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

కేజీబీవీలో కంటి పరీక్షలు



విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: స్థానిక కస్తూర్బా పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 274 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామని డాక్టర్ వెంకటరమణ తెలియజేశారు. మనిషి శరీరంలో కళ్లు చాలా సున్నితమైనవని, ఎలాంటి అపాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశావర్కర్ సాజన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలధి



గొల్లపల్లిలో జలధికి వెళ్తున్న పీర్లు

రాప్తాడు: పుల్లలరేవు, బొమ్మేపర్తి, గొల్లపల్లి, హంపాపురంలో మంగళవారం పీర్ల జలధి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి పీర్లను ఊరేగించారు. దప్పులు, మేళం నడుమ పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. యువకులు గుండం చుట్టూ ఆలావ్ తొక్కారు. సాయంత్రం పీర్ల ఊరేగింపు జరిగింది. భక్తులు బెల్లం ఉండలను పీర్లపై విసిరి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాప్తాడు సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మంగళవారం మొహర్రం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం రాత్రి ఆయా గ్రామాల్లో ప్రజలు పీర్ల స్వాములకు పానకాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొక్కుబడి ఉన్న భక్తులు అగ్నిగుండంలోకి పెద్ద పెద్ద మొద్దులను తరలించారు. తెల్లవారు జామున పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. మంగళవారం సాయంత్రం పీర్లను ఆయా గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుదేవనహళ్లి వేదావతి హగరి నది నుంచి మంగళవారం ఉదయం ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని సింగనహళ్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎన్. వన్నూరుస్వామిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆగస్టుకు బియ్యంతో సరి!

- నెరవేరని కూటమి ప్రభుత్వ హామీ
- బియ్యం మాత్రమే సరఫరా

ఆత్మకూరు: ఆగస్టు నెలలో చౌక దుకాణాల ద్వారా బియ్యం మాత్రమే అందించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి చౌకబియ్యం సరఫరా అయినట్లు అధికారులు తెలియజేశారు. వివరాల్లోకి వెళితే.. తాము అధికారంలోకి వస్తే రేషన్ దుకాణాల ద్వారా రాష్ట్ర ప్రజలకు బియ్యంతోపాటు సబ్సిడీ కింద గోధుమ పిండి, చెక్కెర, కంది బ్యాళ్లు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తామని ప్రజలకు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు నెలలు పూర్తి కావస్తున్నా హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. మండలంలో గతంలో 34 రేషన్ దుకాణాల ద్వారా 12 వేల కార్డుదారులకు ఇంటింటికీ రాగులు, జొన్నలు, చెక్కెర, బ్యాళ్లు పంపిణీ చేశారు.



చౌక డిపోలో ఉన్న రేషన్ బియ్యం

అన్నింటా కొత్త వారే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండలంలో అన్ని రేషన్ దుకాణాల్లో డీలర్లను ఇప్పటికే మార్చారు. ప్రస్తుతం కొత్త డీలర్లకు సంబంధించిన ఇళ్ల వద్ద రేషన్ బియ్యాన్ని ఉంచారు. కొత్త డీలర్లు కావడంతో ప్రజలు ఎక్కడ రేషన్ షాపు ఉందో తెలుసుకోవడంలో ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. ఉపాధి హామీలో 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా ప్రస్తుతం వారిని వేటులా పని చేయిస్తూ 25 రోజుల తరువాత కొత్తవారికి ఫీల్డ్ అసిస్టెంట్లుగా బాధ్యతలు తప్పగించనున్నట్లు తెలుస్తోంది. మండలంలో 72 మంది మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఉండగా ప్రస్తుతం 25 మంది కొత్త వారు వచ్చారు.

42 మంది మరణించారా ?

ఆగస్టు 1వ తేదీ నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంది. ఒకే రోజు వంద శాతం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మండల వ్యాప్తంగా జూలై నెలలో 5,935 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా ఆగస్టులో 5893 మందికి మాత్రమే పింఛన్ నగదు జమ అయింది. 42 మందికి పింఛన్ కోత విధించారు. మండలంలో 42 మంది మరణించారని, అందువల్లే పింఛన్ నగదు జమ కాలేదని అధికారులు తెలియజేశారు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

- నగరంలో కొత్తగా రూ.13.80 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఊహకందని అభివృద్ధి పనులు ప్రారంభించామని, వాటిని పరుగులు పెట్టిస్తామని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సాధారణ నిధులు రూ.7.29 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.89 కోట్లు, ఎస్‌ఎఫ్‌సీ నిధులు రూ.2.60 కోట్లతో పనులను చేపడతామన్నారు. ఈ పనులకు సంబంధించి టెండర్లను పూర్తయ్యాయన్నారు. అనంతపురం ఎంపీ, ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ పాలకవర్గం సహకారంతో నగరాభివృద్ధి కొనసాగిస్తామన్నారు. నగరంలో తాగునీటి సమస్య నివారణకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో 760 హెచ్‌పీ మోటార్లు, పంపు ఇతరత్ర విడిభాగాలను, సాధారణ నిధులు రూ.50 లక్షలతో 500 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. పీఏబీఆర్ డ్యాంలో నీటి పంపింగ్ కేంద్రం వద్ద ఆరు నెలల క్రితం పాత మోటార్లు కాలిపోవడంతో నగరానికి తాగునీటి సమస్య ఏర్పడిందని, అలాంటి సమస్య రాకుండా ఉండాలని కొత్త మోటార్లను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రాంనగర్ 80 అడుగుల రోడ్డు నుంచి నీరు ప్రగతి వనం పార్క్ మీదుగా రూ.2.20 కోట్లతో (ఎస్‌ఎఫ్‌సీ నిధులు) రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో కాలువ, రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు పెంపకం చేపట్టనున్నట్లు వివరించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

ఆత్మకూరు: ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజనేయులు సూచించారు. మంగళవారం వేపచెర్ల ఎగువ తండాలో ప్రజలకు న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ చట్టాలు, పథకాలను తెలుసుకోవాలన్నారు. ఆర్థికస్తోమత లేని కక్షిదారులకు ప్రభుత్వం ఉచిత న్యాయ సేవలను అందిస్తుందని తెలిపారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులు, అధికారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్‌కు కాలువా కప్పి, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భ్రమరాంబాదేవి, డీపీఎంఓ రవికుమార్, డాక్టర్ సదీష్ సుల్తానా, ఎంపీడీఓ దశరథరామయ్య, ఎంఈఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజా కల్యాణం తిలకించండి



మహాశివుడికి నృత్యనీరాజనం

అనంతపురం కల్చరల్: జన్మాంతర పాపాలను తొలగించే గిరిజా కల్యాణాన్ని తిలకించి పునీతులు కావాలని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ పిలుపునిచ్చారు. శ్రీరామకృష్ణ సేవా సమితి 20వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మూడవరోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలులో శివసాక్షాత్కారంపై సామవేదం షణ్ముఖశర్మ గత నాలుగు రోజులుగా చేస్తున్న ఆధ్యాత్మిక ప్రసంగం ముగింపు దశకు చేరుకుంది. శివుని లీలా విశేషాలను ఉపమాన సహితంగా అద్భుతంగా వివరిస్తున్న షణ్ముఖశర్మ బుధవారం జరగనున్న గిరిజాకల్యాణ విశిష్టతను తెలియజేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాయిట్రస్టు వారు శ్రీశైలం, అలంపూర్ క్షేత్రాల నుంచి తరలి వచ్చే రుత్విజులతో కల్యాణ మహోత్సవం సాగుతుందన్నారు. పవిత్ర ఆషాఢ మాసంలో గురు దంపతులనే శివపార్వతులుగా భావించి సారె సమర్పించడం, ఒడిబియ్యాన్ని భక్తులే స్వయంగా సమర్పించేవిధంగా సాగుతుందని అభినందనీయమన్నారు. నిర్వాహకులు విజయకుమార్ మాట్లాడుతూ ఒడిబియ్యాన్ని జడ్పీ చైర్మన్ బోయగిరిజమ్మ, స్వామివారి పెండ్లి వస్త్రాలు, తలంబ్రాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దంపతులు సమర్పిస్తారని తెలిపారు. అంతకు ముందు శ్రీనృత్యకళానిలయం చిన్నారులు శివపదం నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించి మెప్పించారు. కార్యక్రమంలో జడ్డి శోభారాణి, నాట్యాచార్యులు సంధ్యామూర్తి, రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు డాక్టర్ కృష్ణ శశి, ప్రవీణ్‌కుమార్, శ్రీధరమూర్తి, బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనిధి రఘు, ఇన్నర్‌వీల్ సంస్థ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

సీఏలో రైతు బిడ్డ ఉత్తీర్ణత

కణగానపల్లి: మండలానికి చెందిన ఓ రైతు బిడ్డ చార్టెడ్ అకౌంటెంట్(సీఏ) కోర్సులో ఉత్తీర్ణత సాధించింది. తగరకుంట గ్రామానికి చెందిన రైతు కొత్తపల్లి వెంకటరామిరెడ్డి, శాంతమ్మకు కూతురు జనని సాత్విక ఇటీవల విడుదలైన సీఏ ఫలితాల్లో పాస్ అయింది. ఈసందర్భంగా ఆమెను తల్లిదండ్రులతోపాటు బంధువులు, స్నేహితులు అభినందించారు. ఉన్నత సంస్థలో సీఏఫ్‌గా స్థిరపడాలని లక్ష్యం పెట్టుకున్నట్లు విద్యార్థిని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు బోనాలు



సింగంపల్లిలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు, బాలికలు

ఆత్మకూరు: సింగంపల్లి గ్రామంలో ఆఖరి ఆషాఢ మంగళవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు పెద్ద ఎత్తున బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయంలోని పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఏటా ఆషాఢ మాసం చివరి మంగళవారం అమ్మ వారికి బోనాలు సమర్పిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు.

'అబాకస్'లో క్రీసెంట్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థి ప్రథమేష్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక రామ్‌నగర్‌లోని క్రీసెంట్ స్కూల్ 6వ తరగతి విద్యార్థి ప్రథమేష్ అబాకస్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచాడని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కరస్పాండెంట్ షమీం షఫీవుల్లా, హెచ్‌ఎం వెంకటేష్, గణితం టీచర్లు వత్సల, అరుణ తదితరులు మాట్లాడుతూ ప్రథమేష్ సహజంగానే ప్రతిభావంతుడన్నారు. అబాకస్ పోటీల్లో అపార ప్రతిభ కనబరిచి ఛాంపియన్ గా నిలవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లలితకుమారి

అనంతపురం మెడికల్: ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లలిత కుమారి పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నుంచి హిందూ శ్మశాన వాటిక సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రొఫెసర్ అనంతమ్మ, అధ్యాపకులు భాగ్యరాణి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను సకాలంలో తరలించాలి



చెత్తను తరలించాలని సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: చెత్తను సకాలంలో కంపోస్టుకు తరలించాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరంలోని రాంనగర్, కృపానందనగర్, నాయక్‌నగర్, ఆర్టీసీ కార్యాలయం రోడ్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. వ్యాపారులు చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

లోకాయుక్తకు వివరాల అందజేత

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన 9 ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను ప్రత్యేక లోకాయుక్తకు సమగ్ర వివరాలు అందజేశారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీకి జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య సమాచారం పంపారు. ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించి తప్పిదాలు జరిగాయని సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ప్రత్యేక లోకాయుక్తలో కేసును పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. లోకాయుక్తలో వాదోపవాదనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ పోస్టుల ఎంపిక విధానంలో చేపట్టిన విధివిధానాలు, ప్రత్యేకంగా సంబంధిత నిపుణులు ఎంపిక సమయంలో కమిటీ... సందేహాలు ఈ పరంగా విశ్లేషించి నిర్ధారించారు. సుప్రీంకోర్టులో రికార్డులు సమగ్రంగా నిర్వహించినట్లు నివేదిక అందజేశారు. పాలిమర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసిన వారిని మెకానికల్ సబ్జెక్టుకు ప్రొఫెసర్ పోస్టుకు ఎంపిక చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదు. నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం దరఖాస్తులు పరిశీలన అనంతరం మరో దఫా ఏపీపీ స్కోరు తెప్పించుకున్నారు. ఈ రకమైన తప్పిదాలు జరిగాయని సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు.

టేబుల్ టెన్నిస్ కోచ్‌ను బహిష్కరించాలి

అనంతపురం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ టేబుల్ టెన్నిస్ కోచ్ టి. ధనుంజయరెడ్డి టేబుల్ టెన్నిస్ జిల్లా సంఘం నుంచి బహిష్కరించాలని క్రీడాకారుల తల్లిదండ్రులు జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపింది. టి. ధనుంజయ రెడ్డిపై ఇటీవల జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకున్న సంగతి విదితమే. ఒక క్రీడాకారిణితో అసభ్యంగా ప్రవర్తించడంతో పవిలీఎస్ అధికారులతో విచారణ జరిపించి కాంట్రాక్టు నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో అతను కోచ్‌గా కొనసాగితే శిక్షణకు తమ పిల్లలను ఎవరినీ పంపమని క్రీడాకారుల తల్లిదండ్రులు పేర్కొన్నట్లు సమాచారం.

అండర్-19 జట్టులో చోటు

గుత్తి: అండర్-19 జిల్లా క్రికెట్ జట్టులో గుత్తికి చెందిన భువనేశ్వర్‌కు చోటు దక్కింది. అండర్-19 జిల్లా జట్టుకు భువనేశ్వర్ ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మదు ఆచారి, కోచ్‌లు యుగంధర్‌రెడ్డి, జోషి ఆర్కుమార్ మంగళవారం తెలిపారు. ఆగస్టు ఒకటి నుంచి నరసరావు పేట, పెద్ద చెర్ల, మంగళగిరి లలో జరిగే పోటీల్లో భువనేశ్వర్ పాల్గొంటారన్నారు. భువనేశ్వర్ ఎంపిక పట్ల క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ అవసరం



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: మహిళలు ఏదో ఒక రంగంలో నైపుణ్యాలపై శిక్షణ ఎంతో అవసరమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి కేవీకేలో స్వర్ణోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషక భద్రత, పెరటి కోళ్ల పెంపకం, కోడి గుడ్లు, మాంసం పోషక లాభాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే నైపుణ్యాలపై శిక్షణ అవసరమన్నారు. రైతులకు అందుబాటులో ఉండే చిరుధాన్యాలు, కోళ్లు, పశువుల్లు, విలువ ఆధారిత పదార్థాలపై నిర్వహించి ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ రైతులు, మహిళలు పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. చికెన్, గుడ్డు వంటి పదార్థాలకు మార్కెట్లో డిమాండ్ ఉందన్నారు. అనంతరం పెరటి కోళ్ల పెంపకం, పశు పోషణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధారాణి, డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శేఖర్, చందన, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు బోల్తా

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని నార్పల రహదారిపై కారు బోల్తా పడింది. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం నుంచి నార్పల వైపు వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని రహదారిపై బోల్తా పడింది. కారులో ఎవరికీ ప్రమాదం జరగలేదు. పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

బుక్కరాయసముద్రం: బీటెక్ చదువుతున్న విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని మానవతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, సలీం మాలిక్, విజయ నగర లా కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసలీలా సూచించారు. మంగళవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్టూడెంట్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల భాషపై అవగాహన పెంచుకోవాలన్నారు. చదువులతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ గురు సిద్దప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామిని పట్టు వస్త్రాలతో బంగారు ఆభరణాలతో అలంకరించి పూజలు చేపట్టారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళ హారతి అందించారు. మొక్కుబడి ఉన్న భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

రేపు వేలం పాట

స్వామి వారి దేవస్థానంలో గురువారం ఉదయం 10 గంటలకు దేవాలయ పూజా సామగ్రి అమ్ముకొను హక్కు కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆర్కిరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

గోరంట్ల రూరల్: చిక్కబల్లాపురం జిల్లా గౌరిబిదనూరులో జరిగిన రూ.10లక్షల నగదు చోరీకి సంబంధించి ఏపీలోని అనంతపురం నగరం భాగ్యనగర్‌కు చెందిన చిక్కమగళూరు జిల్లా కొప్ప నివాసి ఫిట్ హనుమంతప్ప కుమారుడు చిన్నగోపాల్(34)ను పోలీసులు అరెస్ట్ చేశారు. కోడూరు తాలూకా రంగపట్టి నివాసి హెచ్. నారాయణప్ప ఈనెల 8న రాత్రి కారులో వెళ్తూ ఏగంటల సమయంలో గౌరిబిదనూరులోని గణేష్ గ్రాండ్ హోటల్‌లో టీ తాగేందుకు వెళ్లాడు. దుండగుడు కారు అద్దాలు ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.10 లక్షలు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్‌ఐ రమేష్ గుగ్గరిలు విచారణ చేపట్టారు. సీసీ కెమెరా ఆధారంగా దొంగను గుర్తించి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడి నుంచి రూ.7లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను హోం మంత్రి పరమేశ్వర్, ఐజీపీ లాబూరామ్ అభినందించారు.



